"మధురమైన పిల్లలూ - బ్రాహ్మణులైన మీ జన్మ దేవతలకన్నా ఉత్తమమైన కళ్యాణకారీ జన్మ ఎందుకంటే బ్రాహ్మణులైన మీరే బాబాకు సహాయకులుగా అవుతారు"

ప్రశ్న:- ఇప్పుడు పిల్లలైన మీరు బాబాకు ఏ సహాయం చేస్తారు? సహాయకులైన పిల్లలకు బాబా ఏ ప్రైజ్ ఇస్తారు?

జవాబు:- బాబా పవిత్రత, శాంతుల రాజ్యాన్ని స్థాపన చేస్తున్నారు, మనం వారికి పవిత్రతా సహాయాన్ని చేస్తాము. బాబా ఏ యజ్ఞమునైతే రచించారో, దానిని మనం సంభాళిస్తాము, కావున తప్పకుండా బాబా మనకు ప్రైజ్ ఇస్తారు. సంగమములో కూడా మనకు చాలా పెద్ద ప్రైజ్ లభిస్తుంది, మనం సృష్టి ఆదిమధ్యాంతాలను తెలుసుకునే త్రికాలదర్శులుగా అవుతాము మరియు భవిష్యత్తులో సింహాసనాధికారులుగా అవుతాము, ఇదే ప్రైజ్.

పాట:- నీవే తల్లివి, తండ్రివి, సహాయకుడవు, స్వామివి, సఖుడవు... (పితు మాత సహాయక స్వామి సఖా...)

ఓం శాంతి. ఇది ఎవరి మహిమ? ఇది పరమ ప్రియమైన పరమపిత పరమాత్ముని మహిమ, వారి పేరు శివ. వారిది ఉన్నతోన్నతమైన నామము కూడా మరియు ఉన్నతోన్నతమైన ధామము కూడా. పరమపిత పరమాత్మ అనగా అర్థము - అందరికన్నా ఉన్నతోన్నతమైన ఆత్మ. ఇంకెవ్వరినీ పరమపిత పరమాత్మ అని అనరు. వారి మహిమ అంతులేనిది. వారికి ఎంత మహిమ ఉందంటే, ఆ మహిమ యొక్క అంతాన్ని పొందలేము అని అంటారు. వారి అంతాన్ని తెలుసుకోలేము అని ఋషులు, మునులు కూడా అనేవారు. వారు కూడా తెలియదు, తెలియదు అంటూ వచ్చారు. ఇప్పుడు బాబా స్వయంగా వచ్చి తమ పరిచయాన్ని ఇస్తారు. ఎందుకు? బాబా పరిచయమైతే ఉండాలి కదా. మరి పిల్లలకు పరిచయం ఎలా లభిస్తుంది? ఎప్పటివరకైతే వారు ఈ భూమిపైకి రారో అప్పటివరకూ ఇంకెవ్వరూ వారి పరిచయాన్ని ఇవ్వలేరు. ఎప్పుడైతే తండ్రి పిల్లలను ప్రత్యక్షం చేస్తారో, అప్పుడు పిల్లలు తండ్రిని ప్రత్యక్షం చేస్తారు. తండ్రి అర్థం చేయిస్తారు - నా పాత్ర కూడా నిశ్చితమై ఉంది. నేనే వచ్చి పతితులను పావనంగా తయారుచేయాల్సి ఉంటుంది. సాధు-సన్యాసులు కూడా - పతితపావన సీతారామ రండి అని గానం చేస్తూ ఉంటారు, ఎందుకంటే ఇది రావణ రాజ్యము. రావణుడు తక్కువైనవాడేమీ కాదు, మొత్తం ప్రపంచమంతటినీ తమోప్రధానంగా, పతితంగా ఎవరు తయారుచేసారు? రావణుడు. అలాగే పావనంగా తయారుచేసే సమర్థుడు రాముడు కదా. అర్ధకల్పం రామరాజ్యం ఉంటే, అర్ధకల్పం రావణుని రాజ్యం కూడా కొనసాగుతుంది. రావణుడు ఎవరు అన్నది ఎవ్వరికీ తెలియదు. అతడిని ప్రతి సంవత్సరం కాలుస్తూ ఉంటారు, అయినా రావణుని రాజ్యం కొనసాగుతూ ఉంటుంది. అతనేమీ కాలడు. మనుష్యులు ఏమని అడుగుతారంటే - పరమాత్మ సమర్థుడు కదా, మరి రావణుడిని రాజ్యం ఎందుకు చేయనిస్తారు? తండ్రి అర్థం చేయిస్తారు, ఈ నాటకమే గెలుపు-ఓటముల, స్వర్గ-నరకాల నాటకము. మొత్తం ఆట అంతా భారత్ పైనే తయారుచేయబడి ఉంది. ఇది తయారై-తయారుచేయబడిన డ్రామా. పరమపిత సర్వశక్తివంతుడు కావున వారు ఆట పూర్తవ్వకముందే వస్తారా లేక ఆటను సగంలోనే సమాప్తం చేయగలరా. తండ్రి అంటారు, ఎప్పుడైతే మొత్తం ప్రపంచమంతా పతితంగా అయిపోతుందో, అప్పుడు నేను వస్తాను, అందుకే శివరాత్రిని కూడా జరుపుతారు. శివాయ నమః అని కూడా అంటారు. బ్రహ్మ, విష్ణు, శంకరులను ఎంతైనా దేవతాయ నమః అని అంటారు. శివుడిని పరమాత్మాయ నమః అని అంటారు. శివుడు బబుల్ నాథ్ మందిరములో లేక సోమనాథ్ మందిరంలో ఉన్నట్లుగానే ఉంటారా? పరమపిత పరమాత్మకు ఇంతటి పెద్ద రూపము ఉందా లేక ఆత్మది చిన్న రూపము మరియు తండ్రిది పెద్ద రూపమా? ఇటువంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి కదా. ఏ విధంగా ఇక్కడ చిన్నవారిని పిల్లలు అని, పెద్దవారిని తండ్రి అని అంటారో, అలా పరమపిత పరమాత్మ ఇతర ఆత్మలకన్నా పెద్దగా మరియు ఆత్మలమైన మనము చిన్నగా ఉంటామా? కాదు. తండ్రి అర్థం చేయిస్తున్నారు - పిల్లలూ, మీరు నా మహిమను గానం చేస్తారు, పరమాత్ముని మహిమ అంతులేనిది అని అంటారు. వారు మనుష్య సృష్టికి బీజము, మరి తండ్రిని బీజము అనే అంటారు కదా. వారు రచయిత, మిగిలిన ఇన్ని వేదాలు-ఉపనిషత్తులు, గీత, యజ్ఞ-తపాదులు, దానపుణ్యాదులు... ఏవైతే ఉన్నాయో అవన్నీ భక్తి మార్గపు సామాగ్రి. వాటికి కూడా తమ సమయం ఉంది. అర్ధకల్పం భక్తి సమయము, అర్ధకల్పం జ్ఞాన సమయము. భక్తి బ్రహ్మ యొక్క రాత్రి, జ్ఞానం బ్రహ్మ యొక్క పగలు. ఈ విధంగా శివబాబా మీకు అర్థం చేయిస్తారు, వారికి తమ తనువు అయితే లేదు. వారు అంటారు, నేను మీకు రాజ్య భాగ్యాన్ని ఇప్పించేందుకు మళ్ళీ రాజయోగాన్ని నేర్పిస్తాను. ఇప్పుడు బ్రహ్మ రాత్రి పూర్తవుతుంది, మళ్ళీ ఆ ధర్మగ్లాని సమయమే వచ్చి చేరుకుంది. అందరికన్నా ఎక్కువగా

ఎవరిని గ్లాని చేస్తారు? పరమపిత శివ పరమాత్ముడిని. యదా యదా హి... అని రాయబడి ఉంది కదా. నేనేమీ కల్పపూర్వము సంస్కృతంలో జ్ఞానం ఇవ్వలేదు. భాష అయితే ఇదే. కావున ఎప్పుడైతే భారత్ లో దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేసేవారి గ్లాని జరుగుతుందో, నన్ను రాయి-రప్పలలో పడేస్తారో, అప్పుడే నేను వస్తాను. ఎవరైతే భారత్ ను స్వర్గంగా తయారుచేస్తారో, పతితులను పావనంగా తయారుచేస్తారో, వారిని ఎంతగా గ్లాని చేసారు.

భారత్ అన్నింటికన్నా పురాతన ఖండమని, అది ఎప్పుడూ వినాశనమవ్వదని పిల్లలైన మీకు తెలుసు. సత్యయుగంలో లక్ష్మీ-నారాయణుల రాజ్యం కూడా ఇక్కడే ఉంటుంది. ఈ రాజ్యాన్ని కూడా స్వర్గ రచయితయే ఇచ్చారు. ఇప్పుడు అదే భారత్ పతితముగా ఉంది, అందుకే నేను మళ్ళీ వస్తాను. కావుననే శివాయ నమః అని వారి మహిమను గానం చేస్తారు. ఈ అనంతమైన డ్రామాలో ప్రతి ఆత్మ పాత్ర నిశ్చితమై ఉంది, అదే రిపీట్ అవుతూ ఉంటుంది. దాని నుండే ఒక భాగాన్ని తీసుకుని హద్దులోని డ్రామాను తయారుచేస్తారు. ఇప్పుడు మనం బ్రాహ్మణులుగా ఉన్నాము, తర్వాత దేవతలుగా అవుతాము. ఇది ఈశ్వరీయ వర్ణము. ఇది మీ 84 జన్మలలో కూడా అంతిమము. ఇందులో నాలుగు వర్ణాల జ్ఞానము మీకు ఉంది, అందుకే బ్రాహ్మణ వర్ణము అన్నింటికన్నా ఉన్నతమైనది. కానీ మహిమ మరియు పూజ అనేది దేవతలకు జరుగుతుంది. బ్రహ్మ మందిరము కూడా ఉంది, కానీ వారిలోకి పరమాత్మ వచ్చి భారత్ ను స్వర్గంగా తయారుచేస్తారని ఎవ్వరికీ తెలియదు. స్థాపన జరుగుతుంది అన్నప్పుడు మరి వినాశనం కూడా కావాలి. అందుకే రుద్ర జ్ఞాన యజ్ఞం నుండి వినాశ జ్వాల వెలువడింది అని అంటారు.

ఇప్పుడు అదే తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తున్నారు - మధురమైన పిల్లలూ, ఇప్పుడు ఇది మీ అంతిమ జన్మ, నేను మీకు మళ్ళీ స్వర్గ వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చాను. మీకు హక్కు ఉంది, కానీ ఎవరైతే నా శ్రీమతంపై నడుస్తారో వారికే నేను స్వర్గము యొక్క ప్రైజ్ ను ఇస్తాను. వారికి కూడా శాంతి పురస్కారాలు మొదలైనవి లభిస్తాయి. కానీ తండ్రి అయితే మీ అందరికీ స్వర్గమనే ప్రైజ్ ను ఇస్తారు. వారేమంటారంటే - దానిని నేను తీసుకోను, నేను మీ ద్వారా స్థాపన చేయిస్తాను కావున దానిని మీకే ఇస్తాను. మీరు శివబాబాకు మనుమలు, బ్రహ్మకు పిల్లలు. ఇంతమంది పిల్లలనైతే ప్రజాపిత బ్రహ్మయే దత్తత తీసుకుంటారు కదా. మీ ఈ బ్రాహ్మణ జన్మ అన్నింటికన్నా ఉత్తమమైనది. ఇది కళ్యాణకారీ జన్మ. దేవతల జన్మ లేక శూద్రుల జన్మ కళ్యాణకారి అయినది కాదు. మీ ఈ జన్మ ఎంతో కళ్యాణకారి అయినది, ఎందుకంటే మీరు తండ్రికి సహాయకులుగా అయి సృష్టిపై పవిత్రత, శాంతులను స్థాపన చేస్తారు. ఈ విషయం గురించి ఆ ప్రైజ్ లు ఇచ్చేవారికి తెలియదు. వారైతే అమెరికన్లు మొదలైనవారికి ఇస్తూ ఉంటారు. తండ్రి అంటారు, ఎవరైతే నాకు సహాయకులుగా అవుతారో వారికి నేను ప్రైజ్ ను ఇస్తాను. పవిత్రత ఉన్నట్లయితే సృష్టిలో శాంతి, సమృద్ధి కూడా ఉంటాయి. ఇదైతే వేశ్యాలయము. సత్యయుగము శివాలయము. దానిని శివబాబా స్థాపన చేసారు. సాధు-సన్యాసులు హఠయోగులు, వారు వెయ్యి సార్లు గీత, మహాభారతాలను చదివినా కానీ వారేమీ గృహస్థ ధర్మం వారికి సహజ రాజయోగాన్ని నేర్పించలేరు. వీరు అందరికీ తండ్రి. మీ బుద్ధియోగాన్ని ఒక్క నాతోనే జోడించండి అని వీరు అన్ని ధర్మాల వారికి చెప్తారు. నేను కూడా ఒక చిన్న బిందువును, అంత పెద్దగా ఉండను. ఆత్మ ఏ విధంగా ఉంటుందో, అలాగే పరమాత్మనైన నేనూ ఉంటాను. ఆత్మ కూడా ఇక్కడ భృకుటి మధ్యలో ఉంటుంది. ఆత్మ అంత పెద్దగా ఉంటే ఇక్కడ ఎలా కూర్చోగలదు. నేను కూడా ఆత్మలానే ఉంటాను. కేవలం నేను జనన-మరణ రహితుడను, సదా పావనుడను మరియు ఆత్మలు జనన-మరణాలలోకి వస్తాయి. పావనం నుండి పతితంగా మరియు పతితం నుండి పావనంగా అవుతాయి. ఇప్పుడు మళ్ళీ పతితుల నుండి పావనులుగా తయారుచేయడానికి తండ్రి ఈ రుద్ర యజ్ఞాన్ని రచించారు. దీని తర్వాత ఇక సత్యయుగంలో ఏ యజ్ఞాలూ ఉండవు. మళ్ళీ ద్వాపరం నుండి అనేక రకాలైన యజ్ఞాలను రచిస్తూ ఉంటారు. ఈ రుద్ర జ్ఞాన యజ్ఞం మొత్తం కల్పంలో ఒకేసారి రచింపబడుతుంది, ఇందులో అందరి ఆహుతి పడుతుంది, ఇక ఆ తర్వాత ఇంకే యజ్ఞాలూ రచింపబడవు. ఎప్పుడైనా ఏవైనా ఆపదలు వస్తే యజ్ఞాలను రచిస్తారు. వర్షాలు పడకపోతే లేక ఇంకేవైనా ఆపదలు వస్తే యజ్ఞాలను రచిస్తారు. సత్య, త్రేతాయుగాలలోనైతే ఎటువంటి ఆపదలు రావు. ఈ సమయంలో అనేక రకాల ఆపదలు వస్తాయి, అందుకే అందరికన్నా పెద్ద షావుకారైన శివబాబా యజ్ఞాన్ని రచింపజేసారు, కావున మొదటి నుండే సాక్షాత్కారాలు చేయిస్తారు. ఏ విధంగా అన్ని ఆహుతి అవ్వనున్నాయి, ఏ విధంగా వినాశనం జరగనున్నది, ఏ విధంగా పాత ప్రపంచం స్మశానంగా అవ్వనున్నది అనే సాక్షాత్కారాలు చేయిస్తారు. మరి ఇంకా ఈ పాత ప్రపంచంపై మనసు పెట్టుకోవాలా, అందుకే పిల్లలైన మీరు అనంతమైన పాత ప్రపంచాన్ని సన్యసిస్తారు. ఆ సన్యాసులైతే కేవలం ఇళ్ళు-వాకిళ్ళను సన్యసిస్తారు. మీరైతే ఇళ్ళు-వాకిళ్ళను వదలకూడదు. ఇక్కడ గృహస్థ వ్యవహారాన్ని సంభాళిస్తూ కూడా కేవలం దీని నుండి మమకారాన్ని తొలగించాలి. వీరంతా ముందే మరణించి ఉన్నారు, వీరిపై ఏం మనసు పెట్టుకోవాలి. ఇది శవాల ప్రపంచము, అందుకే పరిస్తాన్ ను స్మృతి చేయండి, స్మశానాన్ని ఎందుకు

స్మృతి చేస్తారు అని అంటారు.

బాబా కూడా మధ్యవర్తిగా అయి మీ బుద్ధియోగాన్ని తమతో జోడింపజేస్తారు. ఆత్మ, పరమాత్మ ఎంతోకాలము దూరంగా ఉన్నారు... అని కూడా అంటారు కదా. ఈ మహిమ కూడా వారిదే. కలియుగ గురువును పతిత-పావనుడు అని అనలేరు. వారు సద్గతిని ఇవ్వలేరు. అయితే, వారు శాస్త్రాలను వినిపిస్తారు, అంత్యక్రియలను చేయిస్తారు. శివబాబాకు టీచర్, గురువు ఎవ్వరూ లేరు. బాబా అంటారు - నేను మీకు స్వర్గ వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చాను. ఆపై సూర్యవంశీయులుగా అన్నా అవ్వండి లేక చంద్రవంశీయులుగా అన్నా అవ్వండి. ఈ విధంగా ఎలా అవుతారు? యుద్ధం ద్వారానా? కాదు. లక్ష్మీ-నారాయణులూ యుద్ధం ద్వారా రాజ్యం తీసుకోలేదు, అలాగే సీతా-రాములూ యుద్ధం ద్వారా తీసుకోలేదు. వీరు ఈ సమయంలో మాయతో యుద్ధం చేసారు. మీరు గుప్త యోధులు, అందుకే శక్తి సైన్యమైన మీ గురించి ఎవ్వరికీ తెలియదు. మీరు యోగబలముతో మొత్తం విశ్వానికి యజమానులుగా అవుతారు. మీరే విశ్వ రాజ్యాన్ని పోగొట్టుకున్నారు, మళ్ళీ మీరే పొందుతున్నారు. మీకు ప్రైజ్ ను ఇచ్చేవారు తండ్రే. ఇప్పుడు ఎవరైతే తండ్రికి సహాయకులుగా అవుతారో, వారికే అర్ధకల్పం కొరకు శాంతి, సమృద్ధి యొక్క ప్రైజ్ లభిస్తుంది. ఎవరైతే అశరీరిగా అయి తండ్రిని స్మృతి చేస్తారో, స్వదర్శన చక్రాన్ని తిప్పుతారో, శాంతిధామమైన మధురమైన ఇంటిని మరియు మధురమైన రాజధానిని స్మృతి చేసి పవిత్రంగా అవుతారో, వారినే బాబా సహాయకులు అని అంటారు. ఇది ఎంత సహజము. ఆత్మ అయిన మనం కూడా నక్షత్రం వంటివారము. మన తండ్రి అయిన పరమాత్మ కూడా ఒక నక్షత్రం వంటివారు. వారు అంత పెద్దగా ఏమీ ఉండరు కానీ నక్షత్ర రూపానికి పూజ ఎలా చేయాలి, అందుకే పూజ కోసమని వారిని అంత పెద్దగా తయారుచేసారు. పూజ అయితే మొదట తండ్రికే జరుగుతుంది, ఆ తర్వాత ఇతరులకు జరుగుతుంది. లక్ష్మీ-నారాయణులకు ఎంత పూజ జరుగుతుంది. కానీ వారిని ఈ విధంగా తయారుచేసేవారు ఎవరు? సర్వుల సద్గతిదాత తండ్రే, బలిహారమంతా ఆ ఒక్కరిదే కదా. వారి జయంతి (జన్మ) వజ్రతుల్యమైనది, మిగిలినవారందరి జన్మ గవ్వతుల్యమైనది. శివాయ నమః - ఇది వారి యజ్ఞము, దీనిని బ్రాహ్మణులైన మీ ద్వారా రచింపజేసారు. ఎవరైతే పవిత్రత, సుఖ, శాంతులను స్థాపన చేయడంలో నాకు సహాయం చేస్తారో, వారికి ఇంతటి ఫలాన్ని ఇస్తాను అని అంటారు. బ్రాహ్మణుల ద్వారా యజ్ఞాన్ని రచించడం జరిగింది కావున దక్షిణనైతే ఇస్తారు కదా. ఎంత పెద్ద యజ్ఞాన్ని రచించారు. ఇంకే యజ్ఞమూ ఇంతకాలము కొనసాగదు. ఎవరు ఎంతగా నాకు సహాయం చేస్తారో, వారికి అంతటి ప్రైజ్ ను ఇస్తాను. అందరికీ ప్రైజ్ ను ఇచ్చేది నేనే. నేను ఏమీ తీసుకోను, అంతా మీకే ఇస్తాను. ఇప్పుడు ఎవరు చేస్తే వారు పొందుతారు. కొద్దిగానే చేస్తే ప్రజలలోకి వెళ్ళిపోతారు. గాంధీకి కూడా ఎవరైతే సహాయం చేసారో, వారు ప్రెసిడెంట్, ప్రైమ్ మినిస్టర్ మొదలైనవారిగా అయ్యారు కదా. ఇది అల్పకాలికమైన సుఖము. తండ్రి మీకు మొత్తం ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని ఇచ్చి తమ సమానంగా త్రికాలదర్శులుగా తయారుచేస్తారు. నా బయోగ్రఫీని తెలుసుకోవడం ద్వారా మీరు అంతటినీ తెలుసుకుంటారు అని అంటారు. సన్యాసులు ఈ జ్ఞానాన్ని ఇవ్వగలరా. వారి ద్వారా వారసత్వం ఏం లభిస్తుంది. వారు తమ పీఠాన్ని కూడా ఒక్కరికే ఇస్తారు. మిగిలినవారికి ఏం లభిస్తుంది? బాబా అయితే మీ అందరికీ ఆసనమును ఇస్తారు. వారు ఎంతటి నిష్కామ సేవను చేస్తారు, కానీ మీరు నన్ను రాయిరప్పలలో పడేసి ఎంతగా గ్లాని చేసారు. ఇది కూడా డ్రామాగా రచింపబడి ఉంది. ఎప్పుడైతే గవ్వతుల్యంగా అవుతారో, అప్పుడు మిమ్మల్ని వజ్రతుల్యంగా చేస్తాను. నేనైతే లెక్కలేనన్ని సార్లు భారత్ ను స్వర్గముగా తయారుచేసాను, మళ్ళీ మాయ నరకముగా చేసింది. ఇప్పుడు ఒకవేళ ప్రాప్తిని పొందాలంటే తండ్రికి సహాయకులుగా అయి సత్యమైన ప్రైజ్ ను తీసుకోండి. ఇందులో పవిత్రత ముఖ్యమైనది.

బాబా సన్యాసులను కూడా మహిమ చేస్తారు - వారు పవిత్రంగా ఉంటారు కావున వారు కూడా మంచివారే. వారు కూడా భారత్ ను నిలబెడతారు (పడిపోవడం నుండి రక్షిస్తారు) లేదంటే ఏమైపోయేదో తెలియదు. కానీ ఇప్పుడు భారత్ ను స్వర్గంగా తయారుచేయాలి కావున తప్పకుండా ఇళ్ళు-వాకిళ్ళలో ఉంటూ పవిత్రంగా అవ్వవలసి ఉంటుంది. బాప్ దాదాలు ఇరువురూ పిల్లలకు అర్థం చేయిస్తారు. శివబాబా కూడా ఈ పాత చెప్పు ద్వారా పిల్లలకు సలహా ఇస్తారు. తండ్రి కొత్తదాన్ని తీసుకోరు. తల్లి గర్భంలోకైతే రారు. వారు పతిత ప్రపంచంలోకి, పతిత శరీరంలోకే వస్తారు. ఈ కలియుగంలో ఘోర అంధకారం ఉంది. ఘోర అంధకారమునే ప్రకాశముగా తయారుచేయాలి. అచ్ఛా.

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈ అనంతమైన ప్రపంచమును మనస్ఫూర్తిగా సన్యసించి తమ మమకారమును తొలగించి వేయాలి, దీనిపై మనస్సు పెట్టుకోకూడదు.

2. బాబాకు సహాయకులుగా అయి ప్రైజ్ ను తీసుకునేందుకు - 1. అశరీరులుగా అవ్వాలి, 2. పవిత్రముగా ఉండాలి, 3. స్వదర్శన చక్రమును తిప్పాలి, 4. మధురమైన ఇంటిని మరియు మధురమైన రాజధానిని స్మృతి చేయాలి.

వరదానము:- విశేషతలను ముందు ఉంచుకొని సదా సంతోషంగా ముందుకు వెళ్ళే నిశ్చయబుద్ధి విజయీ రత్న భవ

మీ విశేషతలేవైతే ఉన్నాయో, వాటిని మీ ముందు ఉంచుకోండి, బలహీనతలను కాదు, అప్పుడు మీపై మీకు నమ్మకము ఉంటుంది. బలహీనతలకు సంబంధించిన విషయాలను ఎక్కువగా ఆలోచించకండి, అప్పుడే సంతోషంలో ముందుకు వెళ్తూ ఉంటారు. బాబా సర్వశక్తివంతుడు కావున వారి చేతిని పట్టుకునేవారు ఆవలి తీరానికి తప్పకుండా చేరుకుంటారు అన్న నిశ్చయమును పెట్టుకోండి. ఇటువంటి సదా నిశ్చయబుద్ధి కలవారు విజయీ రత్నాలుగా అవుతారు. మీపై మీకు నిశ్చయము, బాబాపై నిశ్చయము మరియు డ్రామాలోని ప్రతి దృశ్యాన్ని చూస్తూ దానిపై కూడా పూర్తి నిశ్చయము ఉండాలి, అప్పుడు విజయులుగా అవుతారు.

స్లోగన్:- పవిత్రత యొక్క రాయల్టీలో ఉన్నట్లయితే హద్దులోని ఆకర్షణల నుండి అతీతంగా అవుతారు.